క్లుప్తంగా

'ఉపాధి' పనుల్లో వేగం పెంచాలి



పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మణ్

ఇచ్చోడ: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని ఎల్లమ్మ కుంట చెరువులో చేపడుతున్న పూడితతీత పనులను పరిశీలించారు. కూలీలతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న సందర్భంగా పూడికతీత పనుల్లో వేగం పెంచి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం: రిమ్స్ ఆస్పత్రిలో పని చేస్తున్న సూపర్‌వైజర్లు, కాంట్రాక్టర్ వేధింపులు తాళలేకే పేషెంట్ కేర్ లక్ష్మీగణపతి ఆత్మహత్యకు యత్నించిందని, ఇందుకు కారకులైన వారిపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు నళినీరెడ్డి, కుంటాల రాములు, రమేశ్ బుధవారం రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న లక్ష్మీగణపతిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. టార్చర్ భరించలేక ఫినాయిల్ తాగి ఆత్మహత్యకు పాల్పడిందని, బాధ్యులైన ఇద్దరు సూపర్‌వైజర్లు, ఒక కాంట్రాక్టర్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యవసాయ మార్కెట్‌లో అధికారుల ఆడిట్



ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్‌లో అధికారులు బుధవారం ఆడిట్ నిర్వహించారు. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో లావాదేవీలు, పలు వివరాలు, చేసిన పనులతో ఇతర అంశాలపై ఆడిట్ నిర్వహించారు. రికార్డులను పరిశీలించి ఆడిట్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారులు సల్లావుద్దిన్, ఖలీమ్, మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి నార మనోహర్, సిబ్బంది స్వామి, ముఖీద్ ఉన్నారు.

నిలిచిన రోడ్డు పనులు



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

బోథ్: మండలంలోని ధన్నూర్(బి) గ్రామం నుంచి నాగాపూర్ వరకు రోడ్డు పనులు నిలిచిపోవడంతో నాగాపూర్ గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బుధవారం కురిసిన వర్షానికి రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో కనీసం నడవలేని పరిస్థితి నెలకొంది. ఆటోలు సైతం వెళ్లడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా భవన నిర్మాణం



నిలిచిన భవన నిర్మాణ పనులు

తాంసి: 'మనఊరు మనబడి'లో భాగంగా భీంపూర్ మండలంలోని అర్లి(టి) ప్రాథమిక కొన్నత పాఠశాలకు గతేడాది నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కానీ ఏడాదిన్నర గడుస్తున్నా.. పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలేశాడు. కాగా మరో నెల రోజులైతే మళ్లీ పాఠశాలలు పున:ప్రారంభమవుతాయి. అధికారులు స్పందించి భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

19 వరకు జొన్న కొనుగోళ్లు బంద్

బోథ్: బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో గురువారం నుంచి 19వరకు జొన్న కొనుగోళ్లు నిలిపివేయనున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి స్వామి తెలిపారు. బుధవారం వర్షం కురవడంతో జొన్న పంట కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. తిరిగి 20 తేదీన ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. రైతులు గమనించాలని కోరారు.

సాగుకు సన్నద్ధం



విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన భూమి

- పంట పొలాలు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- మండలంలో 41వేల ఎకరాల్లో సాగు

ఆదిలాబాద్‌రూరల్: ప్రతీ ఏడాది కంటే నాలుగు రోజులు ముందే వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో రైతులు సాగు సన్నద్ధం అవుతున్నారు. గతం కంటే ముందుగానే వ్యవసాయ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్ని వ్యవసాయ క్షేత్రాలను సిద్ధం చేస్తున్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు మరికొన్ని రోజులు విత్తనాలు వేసేందుకు నీటి తడి పెడుతున్నారు.

అత్యధికంగా పత్తి సాగు..

మండలంలో ఏడు వ్యవసాయ క్లస్టర్‌లు ఉండగా.. ఆయా క్లస్టర్ పరిధిలో 41,900 ఎకరాల్లో వానాకాలంలో పంటలు సాగు కానున్నాయి. వర్షాధార పంటలైన ప్రధానంగా అత్యధికంగా పత్తిని సాగు చేస్తారు. ఇందులో పత్తి 33,800 ఎకరాలు, కంది 3,964 ఎకరాలు, 3,791 సోయాబీన్, తదితర పంటలను గత వానాకాలంలో సాగు చేశారు. ఈఏడాది సైతం వానాకాలంలో అదే తరహాలో పంటలు సాగు అయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు.

పొలాలు సిద్ధం..

వేసవిలో దుక్కులు దున్నడంతో భూమిలోని వేడి బయటకు వెళ్లిపోతుంది. సూర్యరశ్మి భూమిలోకి ప్రవేశిస్తుంది. ఎండ వేడికి పగుళ్లు బారి పంటలకు హాని చేసే క్రిమికీటకాలు చనిపోవడమే కాకుండా కలుపు మొక్కల విత్తనాలు మొలకెత్తకుండా నివారించవచ్చు. సాగు చేసిన భూమి ఎండిపోయి వర్షం కురిసిన వెంటనే నీరు లోనికి చేరుతుంది. దుక్కులు సిద్ధం చేయడంతో కలుపు నివారణ మొక్కల బెడద తగ్గి భూసారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుంది. విత్తనాలు వేసే సమయానికి నెల రోజులు ముందుగా మూడు, నాలుగు పర్యాయాలు దున్నడంతో భూమిలో తేమ శాతం అధికంగా ఉండి పంటకు హాని చేసే క్రిమికీటకాలు, కలుపు మొక్కల విత్తనాలు వృద్ధి చెందుతాయి. దీంతో పంట ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుంది.

పొలాన్ని సిద్ధం చేసుకుంటున్నాం



రోజు రోజులకు వర్షం పడేలా మొగులు అవుతుంది. అందుకే విత్తనాలు వేసేందుకు ముందుగానే వ్యవసాయ పొలంలో పేరుకుపోయిన కట్టెలను తీయడంతో పాటు కుప్పలను నిప్పుతో తగలబెడుతున్నాం. వానాలు పడడంతో మొదలు అవ్వగానే ఆ సమయంలో విత్తనాలు వేస్తాం.

– నగేశ్, రైతు, కచికంటి

జూన్ మొదటి వారంలో..



రబీలో జొన్న పంట వేశాను. ఆ పంటను తొలగించాం. వర్షాలు త్వరలో వస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో వ్యవసాయ పొలంలోని తుక్కును తొలగిస్తున్నాం. ప్రతీ ఏడాది వానాకాలంలో సోయాబీన్, పత్తి పంట సాగు చేస్తాను. ఈఏడాది కూడా వానాకాలంలో పత్తి, సోయాబీన్ పంటలను వేస్తాను.

– కుర్ర సురేష్, రైతు, కచికంటి

'కష్టపడి పని చేసిన వారికే గుర్తింపు'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారికే గుర్తింపు ఉంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టపడి గడప గడపకూ వెళ్లి ప్రచారం చేసిన ప్రతీ ఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండాయే ఎగరబోతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఖయ్యూం, ఎక్బాల్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

ఉట్నూర్‌రూరల్: అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం రాత్రి ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో జరిగిన గౌతం బుద్ధుడు, అంబేద్కర్ జయంతిలో పాల్గొన్నారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్‌ఎస్‌ఎస్ దళితుల, ఆదివాసీ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలను దెబ్బతీసే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా కలిసి కట్టుగా ఉండి ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. యువత బుద్ధుడు, అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, కిన్వట్ సామాజిక కార్యకర్త ముడిమెత వికాస్, దళిత సంఘాల నాయకులు భరత్‌వాగ్మారే, దళిత బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



నగదు అందజేస్తున్న రాథోడ్ రాజశేఖర్

నేరడిగొండ: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని యువ నాయకుడు రాథోడ్ రాజశేఖర్ అన్నారు. నేరడిగొండ మండలంలో ఈనెల 18 నుంచి నేరడిగొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు జరగనుండగా యువ క్రీడాకారులను ప్రోత్సహించేలా టెర్రిఫిక్ హిట్టర్స్ జట్టు సభ్యులకు క్రీడా దుస్తుల కోసం రూ.10వేల నగదు బుధవారం అందజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులకు కొదువ లేదన్నారు. కార్యక్రమంలో జట్టు కెప్టెన్ యోగేశ్వర్, లీగ్ నిర్వాహకులు జాదవ్ పవన్ కుమార్, లఖన్, అనిల్, దినేష్, గణేష్, సిద్ధు, ఆదిత్య, సునీల్, సతీష్, సురేందర్, శ్రీనివాస్, నవీన్ పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ఇచ్చోడ: ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి మండలస్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

పగలే వెన్నెల



సదల్‌పూర్‌లో వెలుగుతున్న వీధి దీపాలు

బేల: మండలంలోని సదల్‌పూర్ గ్రామంలో విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు నిరంతరం వెలుగుతునే ఉన్నాయి. ఆన్ ఆఫ్ స్విచ్‌లు పని చేయకపోవడంతో విద్యుత్ వృథా అవుతోంది. సంబంధిత గ్రామ పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి, తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పచ్చని గూడు



భీంపూర్ మండలంలోని నిపాని గ్రామశివారులోని అంతర్రాష్ట్ర రోడ్డుకు ఇరుపైపులా ఉన్న చెట్లు పచ్చని గూడులా ఆకట్టుకుంటున్నాయి. గతంలో హరితహారంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వచ్చిపోయే వాహనదారులకు, బాటసారులకు ఆహ్లాదం పంచుతున్నాయి. – తాంసి

ప్రమాదకరంగా గుంత



బోథ్ మండల కేంద్రానికి ఆనుకుని ఉన్న పెద్దవాగు వంతెనపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. పెద్ద వాహనాలు వెళ్లితే గంత మరింత పెద్దగా అయ్యే అవకాశం ఉంది. ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– బోథ్

కంకర తేలిన రోడ్డు



నేరడిగొండ మండలంలోని తేజాపూర్ కాలనీ నుంచి తేజాపూర్ గ్రామం వరకు వెళ్లే తారు రోడ్డు కంకర తేలింది. దీంతో గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాంట్రాక్టర్లు నాసీరకంగా నిర్మించడంతోనే ఇలా కంకర తేలిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు. – నేరడిగొండ

'బీఆర్ఎస్ విజయం ఖాయం'



మాట్లాడుతున్న జోగు రామన్న

ఎదులాపురం: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ధీమా వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుంచి పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం చేశారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ పార్టీ గెలుపు కోసం అహర్నిషలు కృషి చేశారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రూ. 10 లక్షలకు పైగా మంది వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందారని, వారంతా కారు గుర్తుకే ఓటు వేశారన్నారు. సైలెంట్ ఓటింగ్ పెద్ద ఎత్తున జరిగిందని, ఆత్రం సక్కు గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, రోకండ్ల రమేశ్, సాజిదొద్దీన్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, కుమ్ర రాజు, భూమన్న, పర్వీన్, ఫెరోజ్, జోహార్ భాయ్, నవాతే శ్రీనివాస్ పాల్గొన్నారు.

పల్లెల్లో జోరుగా పోలింగ్

- పట్టణాల్లో కనిపించని ఓటు చైతన్యం
- ఆదర్శంగా నిలుస్తున్న గ్రామీణ జనం



ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు (ఫైల్)

బోథ్: పార్లమెంట్ ఎన్నికల్లో పల్లె ప్రజల్లో ఓటు చైతన్యం కనిపించింది. పట్టణాలతో పోలిస్తే పల్లెల్లోనే ఎక్కువగా పోలింగ్ శాతం నమోదైంది. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. పట్టణ ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు నిరాసక్తత కనబర్చారు. పల్లెలో మాత్రం పోలింగ్ జోరు సాగింది. బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా 306 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 2,11,313 మంది ఓటర్లు ఉన్నారు. ఈనెల 13న జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 1,65,157 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. నియోజకర్గ వ్యాప్తంగా 78.16 పోలింగ్ శాతం నమోదైంది. ఇందులో మహిళలు 83062 (76.30 శాతం), పురుషులు 82094 (80.12) శాతం తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు.

ఓటు వేసేందుకు ఆసక్తి..

ఓటింగ్‌ను వినియోగించుకోవడంలో పల్లెలు పట్టణాలకు ఆదర్శంగా నిలిచాయి. పార్లమెంట్ ఎన్నికల్లో పల్లెల్లోని ఓటర్లు 80 నుంచి 90 శాతానికి పైగా ఓటు వేశారు. నియోజవర్గంలోని ఆడెగాం(బి) లో 482 ఓటర్లు ఉండగా.. 450 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 93.36 శాతం పోలింగ్ నమోదైంది. సల్యాద గ్రామంలో 376 మంది ఓటర్లు ఉండగా.. 351 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రంలో 93.35 ఓటింగ్ శాతం నమోదైంది. జోగిపేటలో 93.33, కోసాయిలో 92.54, రత్నాపూర్‌లో 92.06, గాజిలిలో 91.25, షేకుగూడలో 90.58, పల్సి(బి)లో 90.37, అంబుగాం 90.30, శకినాపూర్‌లో 90.19 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో పది పోలింగ్ కేంద్రాలో 90 శాతం కన్నా ఎక్కువగా పోలింగ్ నమోదుకాగా.. 140 పోలింగ్ కేంద్రాల్లో 80 నుంచి 89 శాతం పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రాలన్నీ ఎక్కువగా ఆదివాసీ, గిరిజన గ్రామాల్లోనే పోలింగ్ కేంద్రాలు కావడం గమనార్హం.

పట్టణాల్లో తక్కువగా ఓటింగ్..

పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఇచ్చోడ మండల కేంద్రంలోని 131వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 58.33 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. ఈ పోలింగ్ కేంద్రంలో 660 మంది ఓటర్లు ఉండగా.. కేవలం 385 మంది మాత్రమే తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇచ్చోడలోని మరో పోలింగ్ కేంద్రం 132లో 61.30 శాతం పోలింగ్ నమోదైంది. వెంకటాపూర్‌లో 61.56, ఇచ్చోడలోని 137వ పోలింగ్ కేంద్రంలో 62.07, డెడ్రాలో 62.12, బుగ్గారాం కెలో 64.54, ఇచ్చోడలోని 136వ పోలింగ్ కేంద్రంలో 65.12, 130వ కేంద్రంలో 62.41 శాతం పోలింగ్ నమోదైంది. బోథ్ మండల కేంద్రంలోని 257వ పోలింగ్ కేంద్రంలో 66.12, 251వ పోలింగ్ కేంద్రంలో 66.21 శాతం పోలింగ్ నమోదైంది. మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో తక్కువగా నమోదైంది.

పెరిగిన ఓటింగ్..

గత పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగిన ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెరిగింది. 2019 ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గంలో 1,47,137 ఓట్లు పోలవగా.. ఈసారి 1,65,157 ఓట్లు పోలయ్యాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో 76.09 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈసారి 78.16 శాతం ఓట్లు పోలయ్యాయి.

అందరి సహకారంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ రాథోడ్ సజన్

నేరడిగొండ: అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి చేశానని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మాట్లాడారు. ఐదు సంవత్సరాల కాలంలో మండల అభివృద్ధికి కృషి చేశానని, అధికారులు, నాయకులు, ప్రజల సహకారంతో ముందుకు వెళ్లడం జరిగిందన్నారు. గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ఉన్నందున అధికారులు గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ఆయా శాఖల అధికారులు వారి ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. సమావేశంలో మండల ఉపాధ్యక్షుడు ఏలేటి మహేందర్ రెడ్డి, తహసీల్దార్ సంతోష్ రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, కోఆప్షన్ మెంబర్ సయ్యద్ లాలు, ఎంపీటీసీలు అంబేకర్ పండరి, సవిత, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మండుల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.